బీఆర్ఎస్ విజయాన్ని అడ్డుకోలేరు

అబిడ్స్, మే 6 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపట్టిన సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు దోహద పడ్తాయని ఎమ్మెల్సీ ఎంఎస్. ప్రభాకర్‌రావు, నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సీహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లోని పలు ప్రాంతాలలో వారు సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకపోవడంతో ఆ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, చెప్పిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను చేపట్టే బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సంసిద్ధులై ఉన్నారని తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఎంఎస్. ప్రభాకర్‌రావు

పద్మారావు గౌడ్ విజయం ఖాయం

చిక్కడపల్లి : ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోతో నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపిందని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ భారీ మెజార్టీ సాధించడం ఖాయమని అన్నారు. సోమారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఠా జయసింహ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాకేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, రవిశంకంర్‌గుప్తా, కిరణ్ పాల్గొన్నారు.

పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ప్రచారం

గోల్నాక, మే 6: అంబర్ పేట డివిజన్ దుర్గానగర్, ఆజాద్‌నగర్, ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాల్లో సికింద్రాబాద్ లోక్ సభ బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్‌కు మద్దతుగా సోమవారం స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్ తో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డీడీ కాలనీలో ఇంటింటి ప్రచారం

అంబర్‌పేట, మే 6 : సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి టి. పద్మారావు గౌడ్ కు మద్దతుగా బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ డివిజన్‌లోని డీడీ కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ సోమవారం ప్రచారం నిర్వహించారు. ఆమెతో పాటు పార్టీ మహిళా నాయకులు పి.భారతిరెడ్డి, మహేశ్వరి తదితరులు ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాచిగూడ,మే 6: పేదల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపిస్తాయిని బీఆర్ఎస్ నాయకుడు పట్లూరి సతీశ్ అన్నారు. నింబోలిఅడ్డా, కుద్బిగూడ ప్రాంతాల్లో పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి, నిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడే బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపునకు కార్యకర్తలు శ్రామించాలని ఆయన అన్నారు.

పద్మారావుగౌడ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి

కవాడిగూడ, మే 6: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకుడు రవీంద్ర కోక ఆధ్వర్యంలో సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్, మహాత్మానగర్, బ్యాంక్ కాలనీ, సంజీవయ్యనగర్‌లో ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూతముల ఆంజనేయులు, గజ్జెల వినయ్, కొమ్ము రాజేశ్, చిన్న, పృథ్వీ, స్వామి, అర్జున్, లతీఫ్, షరీఫ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగలకు జరిమానా

కాచిగూడ,మే 6: రైల్వేస్టేషన్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురినీ రైల్వే కోర్టు మెజిస్ట్రేట్ గౌస్‌పాష ఒక్కొక్కరికీ రూ.3 వేల జరిమానా విధించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన ప్రకారం.. యాకుత్‌పురకు చెందిన సోయల్(25), ఫయాజ్(23), ఇస్మాయిల్(28), అజారుద్దీన్(25)లు 2020 సంవత్సరం జూలై 12 తేదీన తలాబ్‌కట్టకు చెందిన అమీర్‌ఖాన్ అనే వ్యక్తి యాకుత్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా ఆ యువకులు ఆతనిపై దాడిచేసి రూ.2 వేల నగదు, ఖరీదైన రెండు ఫోన్లను లాక్కొని పారిపోయారు. వెంటనే బాధితుడు కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రైల్వే పోలీసులు ఆ నలుగురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం పీపీ జి. రోజారాణి వారిని రైల్వే కోర్టులో హాజరుపరచగా బోయిగూడ రైల్వే 2 ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ గౌస్‌పాష ఒక్కొక్కరికీ రూ.3 వేల జరిమానా విధించినట్లు కాచిగూడ రైల్వే కోర్టు హెడ్‌కానిస్టేబుల్ శ్రీరామ్‌రెడ్డి తెలిపారు.

గృహిణి అదృశ్యం

షహీన్

ఉస్మానియా యూనివర్సిటీ, మే 6: భర్తతో గొడవపడి పిల్లలను వదిలేసి గృహిణి వెళ్లిపోయిన ఘటన ఉస్మాని యా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మాణికేశ్వరీనగర్‌లో ఉండే మహమ్మద్ షరీఫొద్దీన్‌కు షహీన్ (28)తో 2014లో వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు. ఈ నెల 3న షరీఫొద్దీన్ ఉద్యోగానికి వెళ్లాడు. రాత్రి 11.40 గంటలకు తిరిగి రాగా షహీన్ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతోంది. దీంతో అతను ఎవరితో మాట్లాడుతున్నావని ప్రశ్నించగా సమాధానం ఇవ్వలేదు. ఈ విషయంలో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అంతలో అదే బస్తీలో ఉండే షరీఫొద్దీన్ తల్లి రజియా సుల్తానా అక్కడికి వచ్చి వారితో మాట్లాడింది. రజియా తిరిగి వెళ్తుండగా షహీన్‌తో పాటు ముగ్గురు పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. ఉదయం ఏడున్నర గంటలకు షరీఫొద్దీన్ చూడగా షహీన్ కనిపించలేదు. షహీన్ ఎనిమిదిన్నర గంటల సమయంలో రజియాకు ఫోన్ చేసి తన కోసం వెతకకూడదని చెప్పింది. దీంతో షరీఫొద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

బేగంబజార్‌లో వ్యాపారులను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్న హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

అబిడ్స్, మే 6 : ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోషామహల్ నియోజకవర్గం బేగంబజార్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని ఆరోపించారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా తిరిగి ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. మతం పేరుతో బీజేపీ, మజ్లిస్ పార్టీలు ఓట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని, కాని ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. పాతబస్తీలో అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ అన్వర్, ప్రదీప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో కాంగ్రెస్‌కు ఆదరణ కరువు

మాట్లాడుతున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి

కవాడిగూడ, మే 6: కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కమలం వికసిస్తుందని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి అన్నారు. సోమవారం ముషీరాబాద్‌లో బీజేవైఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డికి మద్దతుగా యువ సమ్మేళనం మద్దూరు శివాజీ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్, బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు రచనశ్రీ, సుప్రియానవీన్‌గౌడ్ హాజరయ్యారు. అనంతరం ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. యుసీసీ(ఉమ్మడి పౌరసత్వం) చట్టాన్ని ఉత్తరాఖండ్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా అమలు చేశామని, ఈ చట్టాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేసేందుకు మోదీ సిద్ధంగా ఉన్నారని అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబం నుంచి వచ్చిన మోదీకి పేదల కష్టాలు తెలుసునని, అందుకే దేశ వ్యాప్తం అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని అన్నారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే. లక్ష్మణ్ మాట్లాడుతూ అనేక మార్లు ఇందిరాగాంధీ కుటుంబం రాజ్యాంగాన్ని అవమానపరిచారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్‌లను రద్దు చేస్తారని కాంగ్రెస్ నాయకులు దష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తాము మతపరమైన రిజర్వేషన్‌లకు వ్యతిరేకం కాని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కో-ఆర్డినేటర్ బిజ్జి కనకేశ్‌కుమార్, బీజేవైఎం నాయకులు గడ్డం నవీన్, సందీప్, నవీన్, గౌతమ్, అనిల్ కుమార్, ఆయుష్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండలో అక్బరుద్దీన్ ఒవైసీ ప్రచారం

మెహిదీపట్నం మే 6: కార్వాన్ నియోజకవర్గం గోల్కొండ, టోలిచౌకి, లంగర్‌హౌస్ డివిజన్లలో సోమవారం సాయంత్రం చాంద్రాయణ గుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హైదరాబాద్ ఎంపీగా అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని కోరారు. నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ. నసీరుద్దీన్, నాయకులు అమీర్, మహ్మద్ హరూన్ ఫర్హాన్ పాల్గొన్నారు.

ఇబ్రహీంబాగ్‌లో ఎంఐఎం ప్రచారం

లంగర్‌హౌస్ డివిజన్ ఇబ్రహీంబాగ్‌లో సోమవారం ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని కోరారు. నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్, నాయకులు వజీ ఉజ్జామసిద్ధికీ, మహ్మద్ హరూన్ ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ అభ్యర్థులను గెలిపించండి

చిక్కడపల్లి,మే 6 : సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల పద్మారావుగౌడ్‌తో పాటు భువనగిరి బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌లను పార్టీల కతీతంగా బడుగు బలహీన వర్గాలు, దళిత బహుజనులంతా ఏకమై గెలిపించాలని గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఎన్నో ఏళ్లుగా మూతబడిన కల్లు దుకాణాలను తెరిపించారని, చెట్ల పన్నును రద్దు చేశారని గుర్తిచేశారు. అన్ని కులాలు ఐక్యం చేసి గోల్కొండ కోటను జయించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకొని వీరిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ

చిక్కడపల్లి,మే 6 : భారత రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి సూరేపల్లి రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నోటకు, మందుకు, బిర్యానికి మీ అమూల్యమైన ఓటును తాకట్టు పెట్టవద్దని కోరారు. రాజకీయ వ్యాపారులు, దోపిడీ దారులపై ఓటు తూటాలు పేలాలని తెలిపారు. ప్రలోభాలకు లోనుకాకుండా విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, మనం వేసే ఓటు ఐదేళ్ల పాలన, దేశాభివృద్ధికి సంబంధించిన విషయమని తెలిపారు. సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బైరీ శ్రీనివాస్, జాతీయ నాయకులు చింతకింది జానయ్య పాల్గొన్నారు.

మారం జగదీశ్వర్‌ను కలిసిన నగర శాఖ కార్యవర్గం

టీఎన్‌జీఓ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు న్యాయస్థానం ఇచ్చిన ఇంజక్షన్ ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న టీఎన్‌జీఓ నగర శాఖ అధ్యక్షుడు ఎస్. శ్రీరాం

సుల్తాన్‌బజార్, మే 6 : అక్రమ పద్ధతిలో టీఎన్‌జీఓ నగర శాఖ ఎన్నికలు నిర్వహించి అధ్యక్ష, కార్యదర్శులుగా కొనసాగుతున్న శ్రీకాంత్, హరికృష్ణల ఎన్నికను రద్దు చేస్తూ సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం ఇంజక్షన్ ఉత్తర్వులను జారీ చేసిందని టీఎన్‌జీఓ నగర శాఖ అధ్యక్షుడు ఎస్. శ్రీరాం అన్నారు. ఈ మేరకు సోమవారం నాంపల్లి టీఎన్‌జీఓ భవన్‌లో టీఎన్‌జీఓ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఇంజక్షన్ ఉత్తర్వుల కాపీని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాం మాట్లాడుతూ.. సోమవారం నుంచి టీఎన్‌జీఓఎస్ యూనియన్ నగర శాఖ అధ్యక్షునిగా తాను, తన కార్యవర్గం అధికారికంగా కొనసాగుతుందని తెలిపారు. నగర శాఖ కార్యదర్శి కందుకూరి విఠల్ బాబు, నాయకులు కబుష్ణ, అనిత, అంజలి, స్రుజన, బాలరాజు, చక్రధర్, వినోద్, మధు, నవీన్, గంగులు, జి క్రిష్ణ, పవన్, విశాల్, శ్రీకాంత్, శరత్, భరత్, రాము తదితరులు పాల్గొన్నారు.

శాంతి, భద్రతల పరిరక్షణకు సహకరించాలి



ఏసీపీ సయ్యద్ ఫయాజ్, లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్‌లను సన్మానించిన మఠం అధిపతి రాహుల్‌దాస్ బాబా

మెహిదీపట్నం, మే 6: ప్రజలు శాంతి, భద్రతల పరిరక్షణకు సహకరించాలని గోల్కొండ పోలీస్ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. సోమవారం లంగర్‌హౌస్ సంగం రామందిర మఠంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్‌లను మఠం అధిపతి రాహుల్‌దాస్ బాబా సన్మానించారు. ఇటీవల జరిగిన రామ నవమి, హనుమాన్ జయంతోత్సవ కార్యక్రమాలలో పోలీసులు చేసిన కృషిని బాబా ప్రశంసించి ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌లను సన్మానించారు.

అంబర్‌పేటలో సీఎం రేవంత్ రోడ్ షో

అంబర్‌పేట, మే 6 : అంబర్‌పేట నియోజకవర్గంలో సోమవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు షోను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి తిలక్‌నగర్ చౌరస్తా నుంచి ఫీవర్ దవాఖాన వరకు రోడ్డు షోలో పాల్గొన్నారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిన్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనగా ప్రజలను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. దానం నాగేందర్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. మోదీ రాష్ట్రానికి ఏమీ చేయలేదని విమర్శించారు. గాడిద గుడ్డు ఇచ్చారని ప్రజలచేత అనిపించారు.

నల్లకుంట ఫీవర్ చౌరస్తా రోడ్‌షోలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

వైద్యులపై దాడులు హేయమైన చర్య

సుల్తాన్‌బజార్, మే 6: వైద్యులపై రోగి సహాయకులు దాడి చేయడంతో పాటు డీజిల్ పోసి హత్యా ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాదరావు, కార్యదర్శి డాక్టర్ జక్కుల విజయ్ రావు, కోశాధికారి డాక్టర్ రాజేందర్ కుమార్ యాదవ్ అన్నారు. అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ.. ఆదివారం కోరుట్ల ప్రభుత్వ దవాఖానలో రోగి బంధువులు వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడి చేయడంతో పాటు ఫర్నిచర్ ధ్వంసం చేసినట్లు తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కన్నడిగులు రాజకీయంగా రాణించాలి

కన్నడ సాహిత్య పరిషత్ వ్యవస్థాపక వేడుకల్లో పాల్గొన్న మామిడి హరికృష్ణ, అధ్యక్షుడు విఠల్‌జోషి, ప్రతినిధులు

కాచిగూడ,మే 6: కన్నడిగులు రాజకీయంగా రాణించాలని తెలంగాణ భాషా సంస్కృతి శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ అన్నారు. కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ విఠల్‌జోషి ఆధ్వర్యంలో కన్నడ సాహిత్య పరిషత్ 110వ వ్యవస్థాపక దినోత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నడిగుల రూపకళ నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సుమతి నిరంజన్, కార్యదర్శి సి. రమేశ్‌బాబుతో పాటు 45 సదస్యలు పాల్గొన్నారు.